క్లుప్తంగా

నియామకం

కాశోజీ సెంటర్ : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గుల్లె పల్లి గిరిధర్‌ను నియమిస్తూ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నుంచి గిరిధర్ నియామక పత్రాన్ని అందుకున్నారు.

కేడీసీ ప్రిన్సిపాల్‌కు అభినందన



విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇటీవల అత్యుత్తమ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించటంపై టీజీసీటీఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ సోమయ్య, రంగశాయి పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ బుధవారం కేడీసీలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజీవయ్య, ఐక్యూ ఏసీ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌కు పూలబొకేలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీజీసీటీఏ జిల్లా యూనిట్ బాధ్యులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ సత్యనారాయణ, మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ శ్యామ్, మల్లయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

బస్ పాస్ కౌంటర్ ఏర్పాటు



హన్మకొండ: విద్యార్థుల సౌకర్యార్థం హనుమకొండ నయీంనగర్ పోలీసు హెడ్‌క్వార్టర్ బస్టాప్‌లో బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ బాబు నాయక్ అన్నారు. బుధవారం నయీంనగర్ పోలీసు హెడ్‌క్వార్టర్ బస్టాప్‌లో కౌంటర్‌ను డిపో మేనేజర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బస్‌పాస్ కౌంటర్‌లో విద్యార్థులతో పాటు ఎన్జీవోస్, సీజనల్, దివ్యాంగుల బస్‌పాస్‌లు జారీ చేయనున్నట్లు వివరించారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నిజియా సుల్తానా, సీఆర్‌సీ రవీందర్ రెడ్డి, బస్‌పాస్ కౌంటర్ ఇన్‌చార్జ్ కె.ఎస్.రెడ్డి, రాజయ్య, ఎం.డీ అజీజ్, ఎ.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి వరం



హన్మకొండ: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బుధవారం హనుమకొండలోని సర్క్యూట్ హౌజ్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినయ్ బాస్కర్ మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యానికి సీఎం కేసీఆర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. నియోజకవర్గంలోని పలువురు అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా చితికలబడిన విషయం తెలుసుకుని వారికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి సాయం మంజూరు చేయించి ఆదుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 31 మందికి లబ్ధిదారులకు చెక్కులను అందించారు.

విద్యార్థుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి



వరంగల్: వరంగల్‌లో మెడికో విద్యార్థిని ప్రీతి మరణం మరవకముందే నార్సింగ్‌లోని శ్రీచైతన్య కాలేజీ విద్యార్థి సాత్విక్ ఆత్మహత్య చేసుకోవడం దారుణమని ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్ అన్నారు. బుధవారం కొత్తవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలేజీ యాజమాన్య ఒత్తిళ్లకు లోనై ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సాత్విక్ మరణానికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలన్నారు. విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మాదారపు రవికుమార్, కొల్లూరి రజిత, భరత్, వేణుగోపాల్, లక్ష్మీ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి స్వల్ప గాయాలు

ఖిలా వరంగల్: వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై ఉర్సు గుట్ట సమీపం నాని గార్డెన్ ఎదుట బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఎదురెదురుగా ఆటో ద్విచక్రవాహనాన్ని బలంగా కొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు రోడ్డుపై పడటంతో గాయపడ్డారు. స్థానికులు వారిని ఆటోలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

మత్స్యకారులకు ప్రభుత్వం పెద్దపీట

వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మత్స్యపారిశ్రామిక సహకార సంఘం హసన్‌పర్తి నూతన పాలక వర్గసభ్యులు బుధవారం హన్మకొండలోని ప్రశాంత్‌నగర్‌లో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా రమేష్‌ను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయన్నారు. వందశాతం సబ్సిడీపై చేప పిల్లలను అందిస్తున్న ఏకైక సర్కార్ బీఆర్‌ఎస్ అన్నారు. మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు శీలం పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి పెద్దమ్మ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి, నర్సింహారాములు, పిట్టల సదానందం, సంఘం ఉపాధ్యక్షుడు జితేందర్, పావుశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మత్స్యసహకారులు

ఆలసత్వం వద్దు

అభివృద్ధి పనుల్లో ఆలసత్వం వహించొద్దని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి మండలంలో 13 మందితో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశం బుధవారం హంటర్‌రోడ్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. మండలంలో అభివృద్ధి- సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమన్వయ కమిటీ సభ్యులు గ్రామాలకు వెళ్లి సమస్యలు తెలుసుకుని ఆయాప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సునీత, సునీత, రమేష్, విజయ్, రజనీకుమార్, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధన్‌గౌడ్, రఘు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడిన అమరులు



హన్మకొండ: నివాళులర్పిస్తున్న నాయకులు



కాజీపేటలో..

హన్మకొండ: మాదిగల హక్కుల సాధనకు, ఆత్మగౌరవం కోసం అమరులు తమ జీవితాన్ని త్యాగం చేశారని ఎమ్మార్పీఎస్-టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా అన్నారు. బుధవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్- టీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా మాట్లాడారు. తెల్ల బండ రవి మాదిగ, పొన్నాల సురేంద్ర మాదిగ, దామోదర్ మాదిగ, మహేష్ మాదిగ, ప్రభాకర్ మాదిగ, భారతి మాదిగతో పాటు అనేకమంది తాము నమ్మిన సిద్ధాంతం కోసం అమరులయ్యారని వివరించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించి మాదిగ అమరులకు అంకితమిస్తామని మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడ స్వామి, విజయ్ కుమార్, మొగిలి, సుమన్ కుమార్, సంజీవ్, రాజశేఖర్, సుధన్, కుమార్, సురేందర్, ఈశ్వర్ సింగ్, కిషన్ నాయక్, ఆశీర్వాదం ఉన్నారు.

కాజీపేట: కాజీపేట చౌరస్తాలోని అమర వీరుల స్థూపం వద్ద బుధవారం మాదిగ అమర వీరుల మృతి సంతపంగా మహాజన సోషలిస్టు పార్టీ కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. పశ్చిమ ఇన్‌చార్జ్ చిలువేరు ఆశీర్వాదం, బండారి సురేందర్ మాదిగ, సారంగపాణి, రేణుకుంట్ల ఉమామహేష్, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో..

కేయూ క్యాంపస్: మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఎంఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాదిగ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో బుధవారం మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ మాట్లాడారు. ఎంఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ మధుకర్, జన్నె శేషి, అంజి, రాంబాబు, వెంకటేష్ ఉన్నారు.

హసన్‌పర్తి: మాదిగ జాతి ప్రయోజనాల కోసం ప్రాణాలు అర్పించిన అమరులకు హసన్‌పర్తి మండల కేంద్రంలో ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. కార్యక్రమానికి ఎమ్మెస్పీ సీనియర్ నాయకుడు రాజారపు భిక్షపతి ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని బీజేపీ నోరుమెదపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ సభపై దాడి చేయించడం గర్హనీయం

వరంగల్: కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, విప్‌గా పదవులు అనుభవించి ప్రస్తుతం ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ బీ ఫాంపై గెలిచిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అదే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బహిరంగసభపై దాడులు చేయడం ఆయన దివాలుకోరుతనానికి నిదర్శనమని కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా కన్వీనర్ చిప్ప వెంకటేశ్వర్లు విమర్శించారు. భూపాలపల్లిలో రేవంత్‌రెడ్డి యాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభపై ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన అనుచరులు దాడి చేయడంపై కొత్తవాడలో బుధవారం నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రమణారెడ్డికి కాంగ్రెస్ పార్టీ రాజకీయ భిక్ష పెట్టిందన్న విషయం మర్చిపోయి అదే పార్టీపై దాడి చేయడం దారుణమన్నారు. వ్యక్తిగత అవసరాల కోసం కాంగ్రెస్‌కు ద్రోహం చేసి అధికార పార్టీలో చేరారని అన్నారు. కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ ఓర్చుకోలేక బహిరంగ సభపై దాడి చేశారని పేర్కొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించాలి



ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులకు వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. పీఆర్‌సీ ఇప్పటికే ఆలస్యమైందని వెంటనే పీఆర్‌సీ ప్రకటించి విద్యుత్ ఉద్యోగులకు న్యాయం చేయాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వరంగల్ ఎస్ఈ మధుసూధన్, హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, నాయకులు సామ్యానాయక్, ఆనందం, సాంబరెడ్డి, కిరణ్, జానకి రాంరెడ్డి, సుబ్రమణ్యేశ్వర్ రావు, ఇంద్రసేనా రెడ్డి, మల్లికార్జున్, మహేందర్ రెడ్డి, రాజిరెడ్డి, ఓదేలు, బుచ్చయ్య గౌడ్, శ్రీరాం నాయక్, శశికుమార్, రమణా రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

గ్యాస్ ధరలు తగ్గించాలి

వరంగల్ అర్బన్: పెరిగిన గ్యాస్ ధర పేద ప్రజల గుండెలో దడ పుట్టిస్తోందని నగర మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు. గ్యాస్ ధరలు పెరిగిన నేపథ్యంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అస్తవ్యస్తం ఆర్థిక విధానాలతో వంట గదుల్లో మంట పుడుతోందని విమర్శించారు. శుక్రవారం అన్ని నియోజకవర్గం, పట్టణ, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున సిలిండర్లతో ఆందోళనలు, కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ సూచించారని ఆమె తెలిపారు.

గణేష్‌నగర్‌లో కంటివెలుగు కార్యక్రమం

న్యూశాయంపేట: కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని 43వ డివిజన్ గణేష్‌నగర్‌లో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురు అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు అందచేశారు. నాయకులు విక్టర్, యాఖూబ్‌ఖాన్, మైదం బాబు, సుమన్, ప్రభాకర్, క్రాంతి, సాంబయ్య, రాజశేఖర్, సదానందం, సారయ్య, భరత్, కుమార్ పాల్గొన్నారు.

ఆటో అడ్డా ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని ఆటో డ్రైవర్స్ ఆధ్వర్యంలో బుధవారం ఆటో అడ్డాను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ హాజరై ఆటో అడ్డాను ప్రారంభించి, మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని, ప్రయాణికులను గమ్యానికి క్షేమంగా చేర్చాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సామిశెట్టి ప్రవీణ్, కార్మిక నేత బోగి సురేష్, మర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

హసన్‌పర్తి: ఇటీవల హన్మకొండలో తెలంగాణ ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నంది అవార్డు అందుకున్న హసన్‌పర్తికి చెందిన కనకం రాజును సన్మానించారు. ఆదర్శ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఈకార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, యాదగిరి, సుధాకర్, సదానందం పాల్గొన్నారు.

క్రీడాకారులకు చేయూత



కాజీపేట: సాఫ్ట్ బాల్ సీనియర్ నేషనల్ సౌత్ జోన్ పోటీలకు బాలికల విభాగంలో ఎంపికైన అజ్మీరా కల్యాణి, గీతలకు ప్రోత్సాహంగా నిట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ ప్రయాణ ఖర్చుల కోసం రూ.6,500 బుధవారం అందజేశారు. బాలుర విభాగంలో పి.దిలీప్‌కుమార్, పి.వినయ్ కుమార్ ఉన్నారు. తిరుచ్చిలో ఈనెల 3నుంచి 6వ తేదీ వరకు పోటీలు జరుగనున్నాయి. క్రీడాకారులను సాంబశివరావు, కార్యదర్శి దాబేటి రాజేందర్, ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి, కోచ్ తిబేటి నాగరాజు అభినందించారు.

ఆర్థిక సాయం

ఖిలా వరంగల్: వరంగల్ 37వ డివిజన్ శంభునిపేటలోని గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన షేక్ జాఫర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన ఆ కాలనీ అధ్యక్షుడు ఎండీ ఉల్ఫాత్, కార్మిక నేత బోగి సురేష్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఉల్ఫాత్ రూ.5వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళి, మస్తాఫా, గంధం రమేష్, పోతరాజు షకీల్, శివాజీ, లోకేష్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు అండగా ఉంటా..



మాట్లాడుతున్న వినయ్ భాస్కర్

హన్మకొండ: టాక్సీ వాహన డ్రైవర్లకు తాను అండగా ఉంటానని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ సుబేదారి అల్లీపురలోని కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన ఎత్తెహదుల్ ముస్లిమీన్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ద్వితీయ వార్షికోత్సవ సమావేశంలో వినయ్ భాస్కర్ మాట్లాడారు. ఎత్తెహదుల్ ముస్లిమీన్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ అధ్యక్షతన జరిగిన ఈ వార్షికోత్సవంలో సుబేదారి సీఐ ఎంఏ షుకూర్, బడే మసీద్ మౌలానా రఖీబ్ సాబ్, టీఆర్‌ఎస్ నాయకులు నయిముద్దీన్, నీలం సుహాస్, జహంగీర్ పాషా, అన్వర్, జాఫర్, జక్కి, ఖాజా, హైమద్, నీలం సువాస్, నయీమ్ పాషా పాల్గొన్నారు.

నరేశ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

న్యూశాయంపేట: హేతువాది, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేశ్‌పై బీజేపీ, దాని అనుబంధ సంఘాల కార్యకర్తలు పోలీసు వాహనంలో చేసిన మూకుమ్మడి దాడిని డీవైఎఫ్ఐ(భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య) తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా కార్యదర్శి డి.తిరుపతి అన్నారు. బుధవారం హనుమకొండ సుందరయ్య భవన్‌లో కార్యకర్తల సమావేశంలో తిరుపతి మాట్లాడారు. బైరి నరేశ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, నరేశ్‌కు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సిద్ధాంతాలు, నమ్మకాలను చట్టానికి లోబడి ప్రచారం చేసుకునే హక్కు పౌరులకు రాజ్యాంగం కల్పించిందని అన్నారు. పోలీసులు ఉండగానే వారి సమక్షంలోనే విచక్షణారహితంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని భంగం కల్పించే ఈ తరహా దాడులను ప్రజాసామ్యవాదులంతా ఖండించాలని కోరారు. కిషోర్, సుచందర్, చిరంజీవి, సురేశ్, విజయ్‌కుమార్, హర్ష, సతీశ్, అశోక్, ప్రసాద్, నాగరాజు, రాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించాలి

హసన్‌పర్తి: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని ప్రీమియం స్వస్థ్ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకురాలు సుప్రియ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ×ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూరల్ వీక్‌× కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సుప్రియ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. సరికత్త ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే స్టార్టప్‌లు రూపొందించడంలో మహిళలు ముందు వరుసలో ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి అధ్యతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సార్‌ఐఎక్స్ సీఈఓ డాక్టర్ బి.ఎస్.రావు, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: మాట్లాడుతున్న సుప్రియ

దోచుకొని దాచుకున్నారు



యాత్రలో మాట్లాడుతున్న కొండా సురేఖ

ఖిలా వరంగల్: బీఆర్‌ఎస్ నేతలు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ భూములు కనిపిస్తే దౌర్జన్యంగా దోచుకుని దాచుకుంటే, రైతుల భూములు అన్యాయంగా లాక్కొని రోడ్లు పోస్తున్నారని కాంగ్రెస్ నేత కొండా సురేఖ దుయ్యబట్టారు. హథ్ సే హథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం వరంగల్ 37వ డివిజన్ తూర్పుకోటలోని హనుమాన్ జంక్షన్‌లో తొలుత హనుమాన్ దేవాలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ జంక్షన్ మీదుగా తూర్పుకోట, మధ్యకోట ముస్లిం వీధిమీదుగా స్వయం భూ శ్రీశంభులింగేశ్వరస్వామి ఆలయం వరకు జోడో యాత్ర సాగింది. ఈసందర్భంగా కొండా సురేఖ కార్యకర్తలను ఉద్దేశించి, మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. తూర్పులో తాను చేసిన అభివృద్ధి కనిపిస్తుంది తప్ప నాలుగేళ్లల్లో తట్టెడు మట్టి పోసి అభివృద్ధి చేసిన పాపానపోలేదని విమర్శించారు. కార్యక్రమంలో మీసాల ప్రకాశ్, నల్గొండ రమేష్, సిద్ధం రాము, 37 డివిజన్ అధ్యక్షుడు బోయిన దూడయ్య యాదవ్, బెడిద వీరన్న, కుమార్, కలకోట్ల కుమార్, నలివేల హనుమంతు, తోట ప్రభాకర్, కిరణ్, అచ్చ సంపత్, ఓరగంటి కుమార్, ఎలియా, గిరి, క్రాంతి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్‌దారులకు న్యాయం చేయాలి

హసన్‌పర్తి: దేవన్నపేట శివారులో దళితులకు పంపిణీ చేసిన అసైన్డ్ భూమిని రియల్టర్లు ఆక్రమించుకుని విక్రయించారని, ఆ భూమిని తిరిగి వారికి అప్పగించి న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు చుంచు రాజేందర్ అన్నారు. ఈమేరకు బుధవారం అసైన్డ్‌దారులతో కలిసి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నలుభై ఏళ్ల క్రితం ఈ భూమిని నిరుపేదలకు పంపిణీ చేశారని చెప్పారు. కొంతమంది రియల్టర్లు ఆక్రమించుకుని ప్లాట్లుగా చేశారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం ఆర్డీఓ, తహసీల్దార్లకు కూడా వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, బాధితులు నందిపాక భాస్కర్, పోలెపాక అశోక్, సందెల మల్లయ్య, ఐలయ్య, ఐలమ్మ, సాంబలచ్చమ్మ, సునీత, కట్టయ్య, బిక్షపతి హరీష్, బాబు, అనిల్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న అసైన్డ్‌దారులు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కాజీపేట: చైతన్యపురి కాలనీ పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు బుధవారం వేదపండితుల ఆధ్వర్యంలో యాగశాలలో హోమంలో అగ్ని ప్రతిష్ఠ, ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణం చేసి మూర్తి కుంభ స్థాపనం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్‌లు భక్తులతో కలిసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. డప్పు, వాయిద్యాలతో ఉత్సవ విగ్రహాలను ఆలయ పండితులతో కలిసి శేష వాహనంపై ఊరేగించారు. పండితులు భేరీపూజ, దేవతాహ్వానం, నిత్యహోమం, శ్రీ మద్రామాయణ వెంకటాచల మహత్య పారాయణం, సామూహిక లక్ష్మి అర్చనలు జరిపించారు. పండితులు శ్రీనివాసాచార్యులు దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు చేశారు. పుర ప్రముఖులు పలువురు ఉత్సవాల్లో భాగస్వామ్యం పంచుకున్నారు.

కార్మికులు వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

ఖిలా వరంగల్: కార్మికులు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని శ్రమ శక్తి అవార్డు గ్రహీత బిల్లా శ్రీకాంత్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేష్ కోరారు. ఈమేరకు బుధవారం వరంగల్ తూర్పుకోటలో కార్మిక శాఖ, సీఎస్‌సీ హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు వైద్య శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరంలో 60 రకాల పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి కార్మికుడికి రూ.3,500 ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగరబోయిన చందర్, సీఎస్‌సీ కోఆర్డినేటర్ కమలాకర్, ప్రభాకర్, శ్రీలత, రావుల రమేష్, జనార్ధన్, సతీష్, కుమార్, సాంబమూర్తి పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న శ్రీకాంత్

అల్పాహారంతో చదువుపై దృష్టి

- హనుమకొండ జిల్లాలో 3,258 మంది విద్యార్థులకు స్నాక్స్
- రూ.16,61,580 కేటాయింపు

విద్యారణ్యపురి: ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూళ్లలోని టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారికి రోజూ సాయంత్రం స్నాక్స్ ఇస్తున్నారు. దీంతో పిల్లలు చదువుపై ఏకాగ్రత పెడుతున్నారు. ఉదయం పాఠశాల ప్రారంభ సమయానికి గంటముందు ఉదయం 8-30నుంచి 9-30గంటల వరకు, సాయంత్రం సాయంత్రం 4-45నుంచి మరో గంట 6 గంటల వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. ఉదయం ఇంటినుంచి వచ్చాక సాయంత్రం 6గంటల వరకు పాఠశాలలోనే ఉండాల్సిరావడంతో పిల్లలు ఖాళీకడుపుతో నీరసించి ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. స్నాక్స్ ఇవ్వాలని నిర్ణయించి సమగ్ర శిక్ష ద్వారా నిధులు మంజూరు చేసింది. స్నాక్స్ విషయమై రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన ఇటీవల జిల్లాల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఒక్కో విద్యార్థికి రూ.15 విలువైన స్నాక్స్‌ను ఇచ్చే ప్రక్రియ గత నెల 15నుంచి అమలులోకి వచ్చింది. దీంతో డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తప్పనిసరిగా సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ అందించాలని ఆదేశించారు. ప్రతి ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజన కార్మికుల ద్వారానే వీటిని అందిస్తున్నారు.



జిల్లాలో 3,258 మందికి వర్తింపు

హనుమకొండ జిల్లాలో 123 ఉన్నత పాఠశాలల్లో (మోడల్ స్కూళ్లు కలిపి) 3,258మంది పదవ తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.15 చొప్పున రూ.16,61,580 విడుదల చేశారు. ఆ నిధులను కూడా ఆయా ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థుల సంఖ్యను బట్టి ఎస్ఎంసీ కమిటీ అకౌంట్‌లోకి జమ చేశారు. గత నెల 15నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు స్నాక్స్ అందిస్తారు. హెచ్‌ఎలు బాధ్యత తీసుకొని వారికి రోజూ మధ్యాహ్న భోజన కార్మికుల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాల్సింటుంది. ఏమేమి అందించాలనేది కూడా హెచ్‌ఎంలకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశించారు. అటుకుల చుడువా, వేయించిన పల్లీలు, ఉడకబెట్టిన శనిగలు, బొబ్బెర్లు, రాగి జావ, పండ్లు, ఉప్మా ఇవ్వొచ్చని సంబంధిత అధికారులు హెచ్‌ఎంలను ఆదేశించారు.

రెడీమేడ్ కొనుగోలు చేయొద్దు

బయటి మార్కెట్‌లో రెడీమేడ్‌గా ఉండే స్నాక్స్ కాకుండా మధ్యాహ్న భోజన కార్మికుల ద్వారానే తయారుచేసిన వాటిని లేదా పండ్లు పెట్టాలి. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని బలవర్ధకమైన, సుచి శుభ్రతతో కూడిన అల్పాహారం వేడివేడిగా అందించాలి.

– శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న వాసుదేవ్

వరంగల్: వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను బుధవారం జ్యోతి బాలా మందిర్ ఉపాధ్యాయుడు గుండా వాసుదేవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కవిత మాట్లాడుతూ.. వాసుదేవ్ తన పెళ్లిరోజు సందర్భంగా విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్‌లను అందించడం అభినందనీయమన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని, పాఠశాలకు మంచి పేరు రావాలంటే పదోతరగతి విద్యార్థుల ప్రగతి ముఖ్యమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నవీన్ కుమార్, నర్సింగరావు, బాలగంగాధర తిలక్, ఆరె రమేష్ పాల్గొన్నారు.